సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం ׀ 11 ׀ మార్చి ׀ 2023



గంజాయి ముఠా అరెస్ట్

నూరప్పగూడెం వద్ద ఆటోలో రెండు కిలోల గంజాయిని తరలిస్తున్న నలుగురు యువకులను భీమడోలు పోలీసులు అరెస్ట్ చేశారు.

-IIలో ▸



వ్యర్థాలతో కళాకృతులు


సృజనాత్మకతతో వ్యర్థ పదార్థాలను కళాకృతులుగా తీర్చిదిద్దుతూ ఆకట్టుకుంటున్నారు జిన్నూరుకి చెందిన తాళాబత్తుల వీరభద్రకుమారి.

-IIలో ▸

హెచ్ఐవీకి 'వ్యాక్సిన్'

హెచ్ఐవీ బాధితుల జీవన కాలాన్ని పెంచే క్రమంలో ఎన్‌వీహెచ్‌సీలో భాగంగా హెపటైటిస్ బీ వ్యాక్సిన్‌ను మూడు డోసులుగా వేస్తున్నారు.

-IIలో



న్యూస్‌రీల్

బాల్య వివాహం నేరం



వివరాలు సేకరిస్తున్న సచివాలయ సిబ్బంది

పాలకొల్లు సెంట్రల్: బాల్య వివాహం నేరమని, బాలికలకు వివాహం చేయతలపెట్టిన తల్లిదండ్రులకు సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించారు. పట్టణంలోని శ్రీరామ్‌పేటలో రెండు వేర్వేరు కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలకు 18 ఏళ్లు నిండకుండా నిశ్చయ తాంబూలాలు అందుకున్నట్టు సమాచారం అందడంతో సచివాలయ సిబ్బంది శుక్రవారం తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సంబంధాలు కుదుర్చుకున్నా వివాహం వచ్చే ఏడాది చేస్తామని తల్లిదండ్రులు చెప్పారని అధికారులు తెలిపారు. వీఆర్వో బి. జోగారావు, మహిళా పోలీస్ డి.శ్రీదేవి, వెల్ఫేర్ సెక్రటరీ డి.బుల్లిరాజు, అంగన్‌వాడీ టీచర్ ఎస్.పార్వతి, ఆశావర్కర్ దుర్గాదేవి ఉన్నారు.

మూర్తికి జాతీయ పురస్కారం



ఎంఆర్‌వీ సత్యనారాయణమూర్తి

పెనుగొండ: స్థానిక శతాధిక కథా రచయిత, కవి ఎంఆర్‌వీ సత్యనారాయణమూర్తికి జాతీయ తెలుగు సాహిత్య, సాంస్కృతిక, భాషా సేవా సంస్థ కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య జాతీయ ఉగాది పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ మేరకు శుక్రవారం పెనుగొండలో ఆయన ప్రకటన విడుదల చేశారు. ఈనెల 19న బెంగళూరులో అవార్డు అందుకోనున్నానని పేర్కొన్నారు. తాను రచించిన కథల పుస్తకం 'నీ సుఖమే నే కోరుతున్నా'కి ఉత్తమ ప్రశంసలు లభించాయని తెలిపారు. మూర్తిని ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ కె.రామచంద్రరావు, త్యాగరాజ గాన సభ అధ్యక్షురాలు కె.అన్నపూర్ణ, సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ అభినందించారు.

కొనసాగిన విచారణ



విచారణ చేస్తున్న అధికారులు

పాలకోడేరు: గరగపర్రులో డ్వాక్రా సంఘాల్లో అవకతవకలపై చేపట్టిన విచారణ శుక్రవారం కూడా కొనసాగింది. ఐదుగురు కూడా డ్వాక్రా సిబ్బంది రికార్డులు తీసుకుని రాకపోవడంపై ఏపీఎం రవికుమార్ అసహనం వ్యక్తం చేశారు. డీజీఎం కాంతారావుతో కలిసి ఆయన విచారణ చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న గ్రామ సంఘం పరిధిలోని 33 డ్వాక్రా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని, రూ.31 లక్షల్లో ఎంత మేరకు అవకతవకలకు పాల్పడ్డారనే విషయం తేలాల్సి ఉందన్నారు. విచారణకు ఓబీ ప్రెసిడెంట్లు, సీఏలు పూర్తిస్థాయిలో హాజరకపోవడంపై పీడీకి ఫిర్యాదు చేస్తామన్నారు. రికార్డు పుస్తకాలు ఉన్న మహిళ హాజరుకాకపోవడంతో తనిఖీలు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది.

సరళాదేవికి మహిళా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న సరళాదేవి

తణుకు టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తణుకుకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు వావిలాల సరళాదేవి నవరత్న మహిళా పురస్కారం అందుకున్నారు. ఈనెల 9న హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభ మందిరంలో గుదిబండ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు చేతులమీదుగా తాను అవార్డు అందుకున్నానన్నారు. వావిలాల వెంకట రమేష్, నిర్వాహకులు పాల్గొన్నట్టు చెప్పారు.

ఇంటర్ ప్రశ్నపత్రాలొచ్చాయ్



పశ్నపత్రాల బండిల్స్

ఆకివీడు: ఇంటర్‌మీడియెట్ పబ్లిక్ పరీక్షల సెట్-1 ప్రశ్నపత్రాలు శుక్రవారం ఆకివీడు పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. సెట్-2 పత్రాలు శనివారం రానున్నాయని సూపర్‌వైజర్లు తెలిపారు. ఆకివీడులోని మూడు కేంద్రాల్లో పరీక్షలు జరుగనున్నాయన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- నేటితో ప్రచారానికి తెర
- 13న పోలింగ్.. 16న కౌంటింగ్
- 5 కేంద్రాలు.. 1,105 మంది ఓటర్లు
- పకడ్బందీగా ఏర్పాట్లు



శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణ్‌బాబు

ఏలూరు (మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి శనివారం సాయంత్రంతో తెరపడనుంది. పోలింగ్ ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. ఉమ్మడి జిల్లాలో రెండు ఎమ్మెల్సీ పదవులకు సంబంధించి పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. పోలింగ్‌తో పాటు కౌంటింగ్ ప్రక్రియను పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

ముగిసిన శిక్షణ

ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ సిబ్బందికి శుక్రవారం ఏలూరు ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణా తరగతులు నిర్వహించి ఓట్ల లెక్కింపు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బ్యాలెట్ బాక్సుల సీళ్లను ఏజెంట్ల సమక్షంలో అధికారులు తీయాలని, సీల్ తీసే ప్రక్రియను వీడియో కవరేజ్ చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు.

1,300 బ్యాలెట్లు

ఐదు పోలింగ్ కేంద్రాలకు 1,300 బ్యాలెట్ పేపర్లను జిల్లా అధికారులు సిద్ధం చేశారు. వీటితో పాటు ఆయా పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్సులను, పేపర్లను 12వ తేదీ సాయంత్రమే తీసుకుని అదే రోజు రాత్రికి పోలింగ్ స్టేషన్‌కు చేరుకునేందుకు ఏర్పాట్లు చేశారు. 13న ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రక్రియ మొదలుపెట్టేలా సర్వం సిద్ధం చేశారు.

మద్యం దుకాణాల మూసివేత

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా జిల్లాలోని మద్యం విక్రయ కేంద్రాలను ఈనెల 11వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 13న 4 గంటల వరకు మూసివేస్తున్నట్టు జిల్లా మద్యనిషేధ, అబ్కారి అధికారి ఎస్.బాలకృష్ణన్ తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ఆగిరిపల్లి, ముసునూరు, నూజివీడు, చాట్రాయి, కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాలను మినహాయించి మిగిలిన ప్రాంతాల్లోని మద్యం దుకాణాలు, బార్లు, క్లబ్బులు, కల్లు దుకాణాలను మూసివేస్తున్నట్టు చెప్పారు. అలాగే కౌంటింగ్ జరిగే 16న ఉదయం 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసే వరకూ కౌంటింగ్ కేంద్రం పరిధిలోని ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ 32వ డివిజన్‌లో మద్యం దుకాణాలు, బార్లను మూసివేస్తామన్నారు. అలాగే నాన్-ప్రొపయిటరీ క్లబ్బులు, స్టార్ హోటళ్లు, రెస్టారెంట్లకు సంబంధించి కూడా లైసెన్సులు ఉన్నా మద్యానికి అనుమతి లేదన్నారు. అలాగే కొవ్వూరు రెవెన్యూ డివిజన్‌లోని దుకాణాలు కూడా మూసివేస్తామన్నారు.

1,105 ఓట్లు

ఉమ్మడి జిల్లాలో 856 మంది ఎంపీటీసీలు, 48 మంది జెడ్పీటీసీలు, 180 మంది కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, 21 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు మొత్తంగా 1,105 మంది ఓటర్లు ఉన్నారు. 48 మండలాలకు సంబంధించి 5 రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఐదు పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటుచేశారు. ఆయా కేంద్రాల వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు.

- **ఏలూరు రెవెన్యూ డివిజన్:** ఏలూరు ఎంపీడీఓ కార్యాలయంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ 250 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.
- **జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్:** జంగారెడ్డిగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో కేంద్రం.. 183 మంది ఓటర్లు.
- **కొవ్వూరు రెవెన్యూ డివిజన్:** కొవ్వూరు ఎంపీడీఓ కార్యాలయంలో కేంద్రం.. 242 మంది ఓటర్లు.
- **నరసాపురం రెవెన్యూ డివిజన్:** నరసాపురం ఎంపీడీఓ కార్యాలయం.. 228 మంది ఓటర్లు.
- **భీమవరం రెవెన్యూ డివిజన్:** భీమవరం ఎంపీడీఓ కార్యాలయం.. 202 మంది ఓటర్లు.

ఉదయం 7 గంటల నుంచి..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సర్వం సిద్ధమైంది. పక్కా ఏర్పాట్లు చేస్తున్నాం. 12న రాత్రికే ఎన్నికల సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని, 13న ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించేలా చర్యలు తీసుకున్నాం. అలాగే ఈనెల 11న సాయంత్రం నుంచి 13 సాయంత్రం వరకు మద్యం దుకాణాలు సైతం మూసేందుకు ఆదేశాలు ఇచ్చాం.

– పి.అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్, ఏలూరు జిల్లా

పోలింగ్ కేంద్రం పరిశీలన

ఏలూరు రూరల్: ఏలూరు ఎంపీడీఓ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం జేసీ పి.అరుణ్‌బాబు పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేశా రు. ఓటు వేసిన తర్వాత ఓటర్లు నేరుగా బయటకు వెళ్లేలా చూడాలన్నారు. ఆర్డీఓ పెంచలకిషోర్, జెడ్పీ సీఈఓ కె.రవికుమార్, తహసీల్దార్ బి.సోమశేఖర్ ఉన్నారు.

ప్రాధాన్యత ఓట్లపై అవగాహన



మాక్ పోలింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వంక రవీంద్రనాథ్

పెనుగొండ: పేద వర్గాలకు అండగా నిలిచి వారి అభ్యున్నతికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటానని ఎమ్మెల్సీ అభ్యర్థి వంక రవీంద్రనాథ్ అన్నారు. శుక్రవారం తూర్పుపాలెంలోని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు కార్యాలయంలో ఆచంట నియోజకవర్గంలోని పెనుగొండ, పెనుమంట్ర, ఆచంట, పోడూరు మండలాలకు చెందిన ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలకు ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రాధాన్యతా ఓట్లపై అవగాహన కల్పించి మాక్ పోలింగ్ నిర్వహించారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు నియోజవర్గంలోని ఎంపీటీసీలు మొదటి ప్రాధాన్యత ఓటును రవీంద్రనాథ్‌కు, రెండో ప్రాధాన్యత ఓటును మరో అభ్యర్థి కవురు శ్రీనివాస్‌కు వేయాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఎంపీటీసీల సమస్యలపై ముఖ్యమంత్రితో చర్చించడంతో పాటు కౌన్సిల్‌లోనూ ప్రస్తావించి వారికి అండగా ఉంటానన్నారు. పార్టీ ఆదేశాల ప్రకారం మంచి మెజార్టీని అందించడంతోపాటు ప్రతిపక్షాలకు డిపాజిట్లు దక్కకుండా చూడాలన్నారు. ఎంపీపీలు కేవీ నారాయణరెడ్డి(వాసు), పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), సబ్బితి సుమంగళి, జెడ్పీటీసీలు గుంటూరి పెద్దిరాజు, పోడూరి గోవర్ధన, కర్రి గౌరీ సుభాషిణి, రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వరరెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మది దోచే జంట పుచ్చకాయలు



పట్టణంలోని బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లో వ్యాపారి శ్రీనివాసరావు మహారాష్ట్ర నుంచి తీసుకువచ్చిన పుచ్చకాయల్లో జంట పుచ్చకాయలు ఆకట్టుకుంటున్నాయి. ఇవి వైవిధ్యంగా ఉండటంతో పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– తాడేపల్లిగూడెం (టీఓసీ)

వానరం స్వైర విహారం



వలకు చిక్కిన పండు కోతి, చేతిపై గాయం

పెనుగొండ: సిద్ధాంతంలో శుక్రవారం పండు కోతి స్వైర విహారానికి పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వినాయకుడి గుడి, అగ్నికుల క్షత్రియుల వీధి, రజకుల వీధి పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ పలువురిని గాయపర్చింది. మండపల్లి రమణయ్యను చేతి మీద, చింతపల్లి రవీంద్రను భుజంపై, వెనుక భాగంలో గాయపర్చగా తణుకు ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పండు కోతి విచ్చలవిడిగా సంచరించడంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దీంతో సర్పంచ్ చింతపల్లి గనిరాజు, కార్యదర్శి ఎస్‌వీవీ నరసింహమూర్తి కోతులను పట్టుకునే వారిని పిలిపించి వలలు వేయించారు. ఈ క్రమంలో ఇద్దరికి గాయాలయ్యాయి. అనంతరం పండు కోతిని పట్టుకుని దూర ప్రాంతానికి తీసుకువెళ్లి వదిలిపెట్టారు.

జగనన్న కాలనీలకు శాశ్వత నీటి సరఫరా

భీమవరం (ప్రకాశంచౌక్): జగనన్న కాలనీలకు శాశ్వత నీటి సరఫరా ఏర్పాట్లకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో జల జీవన్ మిషన్ పనులపై ఆమె సమీక్షించారు. ఉగాది నాటికి పూర్తయ్యే కాలనీలకు తొలి ప్రాధాన్యమివ్వాలన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. క్లోరినేషన్‌కు లిక్విడ్ బ్లీచింగ్‌ను మాత్రమే వినియోగించాలని డీపీఓను ఆదేశించారు. జల జీవన్ మిషన్ కింద 1,241 పనులను మంజూరు చేశామన్నారు.

పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు

కలెక్టర్ ప్రశాంతి



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధికి అవకాశాలను పరిశీలించి, ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం పర్యాటకాభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు ఉన్న టూరిజం ప్రాజెక్టులు, వాటి పనితీరును సమీక్షించారు. సన్‌రైజ్ రిసార్ట్ (సిద్ధాంతం), బీచ్ రిసార్ట్ (పేరుపాలెం), పెద్దమల్లం రిసార్ట్స్ (ఆచంట మండలం), బోటింగ్ పాయింట్ అండ్ రెస్టారెంట్ (వలంధర రేవు, నరసాపురం), కాటన్ పార్క్ (ఆకివీడు) ప్రాపర్టీస్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భీమవరంలో ఇరిగేషన్ కెనాల్‌లో బోటింగ్ ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలని, పేరుపాలెం బీచ్‌లో వసతులు మెరుగుపరిచేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పేరుపాలెం, పెదమల్లంలో విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలన్నారు. యలమంచిలి, ఆచంట మండలాల నుంచి టూరిజం అభివృద్ధికి ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు అందజేయాలని ఆదేశించారు. మొగల్తూరు వద్ద బ్యాక్ వాటర్‌లో బోటింగ్‌కు అవకాశాలను పరిశీలించాలని, మొగల్తూరులో నేషనల్ హైవే సమీపంలో టూరిజం ప్రాజెక్టు అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ఇన్‌చార్జి జేసీ ఎం.సూర్యతేజ, డీఆర్వో కె.కృష్ణవేణి, ఆర్డీ అండ్ ఈడీ టూరిజం వి.స్వామినాయుడు, జిల్లా టూరిజం అధికారి మెహ్రాజ్, ఈఈ టూరిజం, ఎలక్ట్రిసిటీ ఈఈ ఫీర్ అహ్మద్‌ఖాన్, డీపీఓ ఎం.నాగలత, ఎం.నాగలత, తహసీల్దార్లు పాల్గొన్నారు.

శిక్షణ గుబాళింపు

- పూల సాగుపై బంగ్లా దేశీయులకు శిక్షణ
- డ్రైఫ్లవర్ టెక్నాలజీపై అవగాహన
- స్వయం ఉపాధికి ప్రయోజనకరం
- మన్ననలు పొందుతున్న ఉద్యాన వర్సిటీ



బంగ్లాదేశ్ నుంచి వచ్చిన శిక్షకులతో వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ వీసీ జానకీరామ్

తాడేపల్లిగూడెం: 'బంగ్లాదేశ్‌లో పూలసాగులో కొత్త పద్ధతులు అనుసరించడానికి శిక్షణ మాకు ఉపయుక్తంగా ఉంది. పూలసాగు, వీటి ఆధారిత వాణిజ్యానికి మా దేశంలో అవకాశం ఉంది. విలువ ఆధారిత ఉత్పత్తులుగా పూలను మార్చుకొనే విషయంలో సాంకేతికత, మెలకువలను అందిపుచ్చుకోవడంలో కొంత అంతరం ఉంది' అని బంగ్లాదేశ్ ప్రతినిధి బృంద సభ్యులు అభిప్రాయపడ్డారు. వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని ఉద్యాన పరిశోధనా స్థానంలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) పర్యవేక్షణలో తొలిసారిగా అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమం మూడు రోజుల క్రితం ప్రారంభమైంది. షేర్ ఏ బంగ్లా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఆ దేశంలోని స్వచ్ఛంద సేవా సంస్థ, సొసైటీ ఫర్ బ్రైట్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ద్వారా పది మంది బంగ్లా దేశీయులు ఇక్కడకు రాగా ఉద్యాన వర్సిటీ అధికారులు శిక్షణ ఇస్తున్నారు. శుక్రవారం శిక్షణ పొందుతున్న బంగ్లా దేశీయులను పలకరించగా పలు విషయాలను తెలియజేశారు. ఎండు పూలతో కళాకృతులు సృష్టించడానికి, గ్రీటింగ్ కార్డుల వంటివి తయారు చేయడానికి, ఉపాధి మార్గాల ద్వారా, వ్యాపారవేత్తలుగా ఎదగడానికి శిక్షణ బహుళ ప్రయోజకరంగా ఉందని అన్నారు.

త్వరలో నేపాల్ నుంచి.. : వీసీ జానకీరామ్

ఎండిన పూలతో కళాకృతుల తయారీ, మహిళలకు శిక్షణ వంటి కార్యక్రమాలు ప్రభుత్వ సహకారంతో ఉద్యానవర్సిటీ చేపట్టి విజయవంతమైందని వర్సిటీ వీసీ జానకిరామ్ అన్నారు. ఐసీఏఆర్ ఆధ్వర్యంలో జరిగిన వీసీల సమావేశంలో ఈ విషయానికి ప్రాచుర్యం లభించిందన్నారు. మాధ్యమాల ద్వారా తెలుసుకున్న కొన్ని దేశాలు ఈ శిక్షణను పొందేందుకు ఆసక్తిగా ఉన్నాయని, తొలిసారి బంగ్లాదేశ్ మహిళలు వచ్చారని చెప్పారు. నేపాల్ నుంచి కూడా శిక్షణకు కొందరు త్వరలో రానున్నారన్నారు.

ఇక్బానా.. మైమరపించే అలంకరణ



శిక్షణ ఇస్తున్న హేమపాథక్

జపాన్ సంప్రదాయ ఇక్బానా (పూలతో అలంకరణ) కళపై సర్టిఫికెట్ కోర్సును ఉద్యాన వర్సిటీలో ప్రవేశపెట్టినట్టు వీసీ టి.జానకిరామ్ తెలిపారు. అంతర్జాతీయ శిక్షణలో భాగంగా హేమపాథక్ (ఢిల్లీ) ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇక్బానా శిక్షకురాలు హేమపాథక్ మాట్లాడుతూ రకరకాల పూలు, కొమ్మలు, ఆకులు, మొగ్గలు వంటి వాటిని శాస్త్రీయ దృక్పథంతో అందమైన ఆకృతులు, బొకేలు, వివిధ పరిమాణాలలో అలంకరించడం ఇక్బానా ప్రత్యేకత అన్నారు. ఇలా రూపొందించిన ఆకృతులు ఎక్కువ రోజులపాటు వాడిపోకుండా ఉంటాయన్నారు. గృహాలు, కార్పొరేట్ కార్యాలయాలు, ఇంటీరియర్ డెకరేషన్, పర్యాటక ప్రదేశాల్లో ఇక్బానా కళదే పైచేయి అన్నారు.

జ్ఞానం సంపాదించేలా..



పూలరంగంలో జ్ఞానం సంపాదించడానికి శిక్షణ అక్కరకు వచ్చింది. ఇలాంటి సదావకాశం కల్పించిన ఉద్యాన వర్సిటీకి ప్రత్యేక ధన్యవాదాలు. పూలను ఆరబెట్టడం, విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడం, ఇకిబినావాస్‌లు తయారు చేయడం వంటివి నేర్చుకున్నా. మా దేశంలో పూలరంగ అభివృద్ధికి శిక్షణ దోహదపడనుంది.

– ఉమ్మెతబస్సుమ్ జానీఫర్, ఫ్లవర్ ఎంటర్‌ప్రెన్యూర్, బంగ్లాదేశ్

డ్రైఫ్లవర్ టెక్నాలజీపై..



డ్రైఫ్లవర్ టెక్నాలజీ గురించి నేర్చుకున్నాను. గులాబీలను ఎన్ని రకాలుగా విలువ ఆధారితంగా మార్చుకోవచ్చో తెలుసుకున్నాను. రోజ్ ఆయిల్, రోజ్ వాటర్, రోజ్ ఆభరణాల తయారీ గురించి తెలిసింది. అద్భుతమైన వర్క్‌షాపులో పాల్గొనే మహదావకాశం కల్పించిన ఉద్యాన వర్సిటీ మేలు మర్చిపోలేను.

– తర్సియా ఆఫ్రోజ్, బంగ్లాదేశ్

సదవకాశంగా..



డ్రైఫ్లవర్‌తో విలువ ఆధారిత ఉత్పత్తులను తయారుచేయడం, పూల సాగును విస్తృతం చేసుకోవడం, సాంకేతికతతో ఆర్థికంగా పరిపుష్టం కావడానికి ఇది గొప్ప అవకాశం. పోస్టు హార్వెస్ట్ టెక్నాలజీ గురించి అవగాహన పెరిగింది. ఉత్పత్తి, మార్కెటింగ్ పద్ధతులు తెలిశాయి. మా దేశ పూల సాగు విస్తరించడానికి శిక్షణ కలిసి వచ్చింది.

– ప్రొఫెసర్ జమాలుద్దీన్, బంగ్లా వ్యవసాయ విశ్వవిద్యాలయం

ఆసక్తి కలిగించేలా..



ఎండిన పూలతో బుక్ మార్కులు, గ్రీటింగ్ కార్డులు, వాల్ మ్యాట్‌లు, పాట్ పొరీలు వంటి వాటి తయారీకి శిక్షణ సాయపడింది. అలంకరణ మొక్కల విషయంలో ఇక్బానా స్టైల్ ఆఫ్ అరేంజ్‌మెంటు ఆసక్తిని కలిగించింది. బంగ్లాదేశ్ కట్ ఫ్లవర్ ఎంటర్‌ప్రెన్యూర్‌లకు ప్రాక్టికల్స్‌గా ఈ శిక్షణ బాగా ఉపయోగపడుతుంది.

–ఫెరో అల్ ముమాన్, డిప్యూటీ సెక్రటరీ, వాణిజ్య మంత్రిత్వశాఖ

క్లుప్తంగా

గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సంఘం ఎంపిక



ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ సభ్యుడిగా నియమితులైన నరసింహారావు దంపతులను సత్కరిస్తున్న గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడిగా కుందుల వీర భద్రరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన పెన్షనర్ల సంఘ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. సంఘ గౌరవ అధ్యక్షుడిగా వై. నరసింహారావు, కార్యదర్శిగా తానేటి భాస్కర రావు, కోశాధికారిగా కే మల్లికార్జునరావుతో పాటు మరో ఆరుగురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. అనంతరం ఇటీవల ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ సభ్యుడిగా నామినేట్ అయిన సందర్భంగా జిల్లాకు చెందిన వై.నరసింహారావు దంపతులను సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రస్తుత రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పీ.మల్లేశ్వర రావు, సీనియర్ నాయకులు గారపాటి మోహనరావు, మంతెన సుబ్బరాజు, ఎండీ అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

ఇనుప వస్తువుల దొంగల అరెస్టు

ఆకివీడు: చెత్త కాగితాలు వేరుకుంటూ భవన నిర్మాణాలకు ఉపయోగించే ఇనుప సామాన్లు దొంగిలిస్తున్న ముగ్గురు వ్యక్తుల్ని స్థానిక తాపీ మేస్త్రీలు శుక్రవారం పట్టుకున్నారు. వారి నుంచి భవన నిర్మాణానికి ఉపయోగించే సామన్లను స్వాధీనం చేసుకున్నారు. ఏలూరుకు చెందిన వంట మేస్త్రీ సత్తిబాబు, రాజమండ్రికి చెందిన మేడిశెట్టి మోహన్, ఉండికి చెందిన కె.శివుడులను పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

హెచ్ఐవీ బాధితులకు హెపటైటిస్ వ్యాక్సిన్

- ఉమ్మడి జిల్లాలో ఇంతవరకూ 5,958 మందికి వ్యాక్సిన్
- ముందువరసలో తణుకు సేఫ్ కేర్ సెంటర్



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని సేఫ్ కేర్ సెంటర్

ఉమ్మడి జిల్లాల్లో వ్యాక్సినేషన్ ఇలా

తణుకు	- 1473
భీమవరం	- 1223
జంగారెడ్డిగూడెం	- 1040
తాడేపల్లిగూడెం	- 856
ఏలూరు ఆశ్రం	- 710
ఏలూరు	- 656



సేఫ్ కేర్ సెంటర్‌లో వ్యాక్సిన్ వేస్తున్న నర్సు, డాక్టర్ రామకృష్ణ

తణుకు అర్బన్ : హెచ్ఐవీ వ్యాధిగ్రస్తుల జీవనకాలాన్ని పెంచే క్రమంలో మరిన్ని సేవలు అందుబాటులోకి తీసుకువస్తుంది ప్రభుత్వం. హెచ్ఐవీ సోకిన వారికి ఇతర రుగ్మతలు త్వరితగతిన ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇప్పటికే టీబీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. హెచ్ఐవీ సోకిన వారిలో మరణాల సంఖ్య తగ్గించే క్రమంలో హెపటైటిస్ బి వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చాయి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు. ఇందులో భాగంగా హెచ్ఐవీ సోకిన వారికి హెపటైటిస్ బి వైద్యపరీక్షలు నిర్వహించి నెగెటివ్ వచ్చిన వారికి ఈ వ్యాక్సిన్ వేస్తున్నారు. నేషనల్ వైరల్ హెపటైటీస్ కంట్రోల్ ప్రోగ్రామ్ (ఎన్‌వీహెచ్‌సీ)లో భాగంగా సీడీసీ అట్లాంటా వారి సాంకేతిక సహకారంతో ఈ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాల్లో 6 సెంటర్ల ద్వారా..

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి ఏలూరులో 2, తణుకు 1, భీమవరం 1, తాడేపల్లిగూడెం 1, జంగారెడ్డిగూడెంలో ఒక సేఫ్ కేర్ సెంటర్ ద్వారా హెపటైటిస్ బి వ్యాక్సిన్‌ను నెలకు ఒకటి చొప్పున మూడు నెలలు మూడు డోసులుగా వేస్తున్నారు. గత నెల 6 నుంచి ఈ వ్యాక్సిన్ పంపిణీ ప్రక్రియ ప్రారంభించడమే కాకుండా విజయవంతంగా అందిస్తున్నారు. ఈ క్రమంలో ఇంతవరకు 5958 మంది హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు ఈ వ్యాక్సిన్ అందచేశారు. 6 సేఫ్ కేర్ సెంటర్‌లలో తణుకు సేఫ్ కేర్ సెంటర్ సిబ్బంది అత్యధికంగా 1473 మందికి వ్యాక్సిన్ అందచేసి ఉమ్మడి జిల్లాల్లో ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాల్లో 21,768 మంది బాధితులు

ఉమ్మడి జిల్లాలకు సంబంధించి ఇప్పటివరకు 21,768 మంది వ్యాధిగ్రస్తులు 6 సేఫ్ కేర్ సెంటర్‌ల ద్వారా మందులు వాడుతున్నారు. వీరిలో 10 వేల మందికి గతేడాది హెపటైటిస్ బీ వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో 184 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ కాగా మిగిలిన వారికి వ్యాక్సిన్ అందచేసే లక్ష్యాన్ని ఏర్పరచుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. తాజాగా సేఫ్ కేర్ సెంటర్‌లకు వచ్చిన వారికి హెపటైటీస్ వైద్య పరీక్ష నిర్వహించి నెగెటివ్ వచ్చిన వారందరికీ వ్యాక్సిన్ అందచేస్తున్నామని వైద్యాధికారులు చెబుతున్నారు.

జీవిత కాలాన్ని పెంచేందుకే వ్యాక్సిన్



హెచ్ఐవీ బాధితుల జీవన కాలాన్ని పెంచేందుకు ఎన్‌వీహెచ్‌సీ ఆధ్వర్యంలో హెపటైటిస్ బీ వ్యాక్సిన్ అందచేస్తున్నాం. వైద్య పరీక్షల్లో హెపటైటీస్ బీ నెగిటివ్ వచ్చిన వారికి ఈ వ్యాక్సిన్ అందచేస్తున్నాం. మందుల కోసం సెంటర్‌కు వచ్చిన వారందరికీ ఈ పరీక్షలు నిర్వహించి వ్యాక్సిన్ వేస్తున్నాం. ఉమ్మడి జిల్లాల్లోని 6 సెంటర్లలో తణుకు సెంటర్ ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియ ముందువరసలో ఉంది.

– డాక్టర్ జి.రత్నకుమారి, ఎయిడ్స్, టీబీ అండ్ లెప్రసీ అధికారి, ఏలూరు

సిబ్బంది కృషి ఫలితమే



హెచ్ఐవీ సోకిన వారిలో ఇతర వ్యాధులు సంక్రమించే పరిస్థితులు ఎక్కువ. ఈ నేపథ్యంలో మరణాల శాతాన్ని తగ్గించే క్రమంలో టీబీ పరీక్షల నిర్వహణతోపాటు మందులు కూడా ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. తాజాగా హెపటైటిస్ వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు.

– డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, తణుకు సేఫ్ కేర్ సెంటర్ వైద్యాధికారి

గంజాయిని తరలిస్తున్న యువకుల అరెస్ట్



సూరప్పగూడెం వద్ద పట్టుకున్న గంజాయి తూకం వేస్తున్న ఎస్సై చావా సురేష్‌కుమార్

భీమడోలు : జాతీయ రహదారి సూరప్పగూడెం వద్ద వాహనాల తనిఖీల్లో ఆటోలో రెండు కేజీల గంజాయిని తరలిస్తున్న నలుగురు యువకులను గురువారం రాత్రి భీమడోలు పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి గంజాయితో పాటు ఆటో స్వాధీనం చేసుకున్నారు. వారిని భీమడోలు జూనియర్ సివిల్ జడ్జిలో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని బత్తులవారిగుంటకు చెందిన దాసరి విజయ్‌కిరణ్, అరిగే దిలీప్, పేరం మల్లేష్, గంధం అంకమరావులు రోజు వారీ కిరాయికి ఆటోను ఫైనాన్స్‌లో తీసుకుని నడుపుతున్నారు. వారికి గంజాయి వ్యసనంగా మారింది. దీనితో ఆ ప్రాంతంలో చిన్న చిన్న పాట్లాల రూపంలో దొరికే గంజాయి కొనుగోలు చేసుకుని తాగేవారు. ఈ మధ్య కాలంలో అక్కడ పోలీసులు గంజాయి అమ్మకందారులపై దాడులు చేసి అరెస్ట్ చేయడంతో గంజాయి విక్రయాలు నిలిచిపోయాయి. దీంతో గంజాయి దొరక్కపోవడంతో సొంతంగా కొనుగోలు చేసుకోవాలని మూడు రోజుల కితం ఆటో వేసుకుని అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన పాడేరు వెళ్లారు. అక్కడ సుందర్ అనే మధ్యవర్తి ద్వారా రెండు కేజీల గంజాయి కొని ఆటోలో పెట్టుకుని తిరిగి వస్తున్నారు. ముందస్తు సమాచారం అందుకున్న భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ తన సిబ్బందితో కలిసి సూరప్పగూడెం వద్ద వాహనాల తనిఖీలు చేస్తున్నారు. ఈ తనిఖీల్లో రెండు కేజీల గంజాయితో పాటు ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసారు. భీమడోలు కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతురాలు బుద్దా చంద్రావతి (87)



పాలకొల్లు - భీమవరం జాతీయ రహదారిలో శివదేవునిచిక్కాల వద్ద చెట్టును ఢీకొని ముందు భాగం నుజ్జయిన దృశ్యం

పాలకొల్లు అర్బన్ : పాలకొల్లు–భీమవరం జాతీయ రహదారిలో శివదేవునిచిక్కాల వద్ద శుక్రవారం ఉదయం స్విఫ్ట్ డిజైర్ కారు కొబ్బరిచెట్టును ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న బుద్దా చంద్రావతి (87) అక్కడికక్కడే మృతి చెందగా నలుగురు గాయపడ్డారు. ఈ కేసుకు సంబంధించి పాలకొల్లు రూరల్ ఎస్సై కె శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాలకొల్లు పట్టణానికి చెందిన కొబ్బరి వర్తకుడు బుద్దా లక్ష్మీ నరసింహరావు, భార్య చంద్రావతి, కుమారుడు రామకృష్ణప్రసాద్, కోడలు యశోదలక్ష్మి, మనవరాలు మేఘన వివాహానికి హాజరై తిరిగి స్వస్థలం పాలకొల్లు వస్తున్నారు. నరసింహారావు కుమారుడు రామకృష్ణప్రసాద్ కారు డ్రైవింగ్ చేస్తున్నారు. ఉదయం మంచు కారణంగా వీరు ప్రయాణిస్తున్న కారు చెట్టును ఢీకొట్టింది. ముందు సీట్లో కూర్చున్న చంద్రావతి అక్కడికక్కడే మృతి చెందారు. రామకృష్ణకు తుంటి ఎముక విరిగింది. నరసింహారావు మనవరాలు మేఘనకు రెండు కాళ్లు విరిగిపోయాయి. నరసింహారావు, కోడలు యశోదలక్ష్మికి స్వల్పగాయాలయ్యాయి. వీరంతా పాలకొల్లులోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదంలో మృతి చెందిన చంద్రావతి మునిసిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు. నరసింహారావు పాలకొల్లులో ఆర్యవైశ్య సంఘంలో, కొబ్బరికాయల వర్తకసంఘంలో పనిచేయడంతో పలువురు ఆయనను పరామర్శించారు. చంద్రావతి మృతదేహానికి పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో పతకాల పంట



ఎస్‌టిసి జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన ఏలూరు సెంటర్ లిఫ్టర్లు

ఏలూరు రూరల్: జాతీయస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ఏలూరు స్టేట్ లెవల్ ఖేలో ఇండియా సెంటర్ లిఫ్టర్లు పతకాలు సాధించారని సెంటర్ ఇన్‌చార్జ్ డీఎన్‌వి వినాయక్‌ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5, 6 తేదీల్లో పాటియాల ఎన్ఎస్ఎన్ఐఎస్ సెంటర్‌లో ఆల్ ఇండియా ఇంటర్ ఎస్‌టిసి వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయని వివరించారు. బాలికల విభాగంలో ఏలూరు ఎస్‌టిసి లిఫ్టర్లు ఎం.శ్రీలక్ష్మీ 55 కేజీలు, ఏ.రేవతి 76 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారని పేర్కొన్నారు. వి.దేవి 76 కేజీలు, ఎం.తేజశ్రీదుర్గా 81 కేజీలు, జి.మధుచందన 81 కేజీల విభాగంలో మూడు సిల్వర్ మెడల్స్ గెలిచారని వివరించారు. ఎం.శ్రీలక్ష్మీ జూనియర్, యూత్ విభాగంలో బెస్ట్ లిఫ్టర్‌గా గుర్తింపు సాధించిందని కొనియాడారు. విజేతలను కోచ్ ఉదయ్‌సందీప్, శాప్ చీఫ్ కోచ్ బి.శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

వేములదీవిలో ప్రజాభిప్రాయ సేకరణ



వేములదీవిలో ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జేసీ సూర్యతేజ

నరసాపురం రూరల్ : నరసాపురం మండలం వేములదీవి గ్రామంలో హార్బర్ నిర్మాణంపై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో నరసాపురం సబ్ కలెక్టర్ ఇన్‌చార్జి జేసీ సూర్యతేజ హాజరయ్యారు. మండలంలోని వేములదీవి వెస్ట్, వేములదీవి ఈస్ట్, బియ్యపుతిప్ప గ్రామాల నుంచి ప్రజలు ఈ అభిప్రాయ సేకరణకు హాజరయ్యారు. హార్బర్ నిర్మాణం పూర్తయ్యాక స్థానికులకే ఉద్యోగావకాశాలు ఇవ్వాలని, హార్బర్ నిర్మాణంతో పాటు తమ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని వారు కోరారు. ప్రజల అభిప్రాయాలను ఉన్నతాదికారులు, ప్రజల దృష్టికి తీసుకెళతానని సబ్‌కలెక్టర్ సూర్యతేజ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఫాజిల్, అప్కాబ్ మాజీ చైర్మన్ అంద్రాజు చల్లారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని రామకృష్ణంరాజు, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, దొంగ మురళీకృష్ణ, తిరుమాని నాగరాజు, కడలి రాంబాబు, ఎంపీటీసీ మైలవీర్రాజు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

18న ప్రత్యేక లోక్ అదాలత్

ఏలూరు (టూటౌన్): జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఈ నెల 18న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి తెలిపారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో అన్ని రకాల కుటుంబ వివాదాలు పరిష్కరిస్తామన్నారు. ఏలూరు, నరసాపురంలో ఉన్న వినియోగదారుల ఫోరం సంబంధించిన కేసులను రాజీ చేస్తుందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఇంతవరకూ 371 కుటుంబ వివాద కేసులు రాజీయోగ్యమైనవిగా గుర్తించామన్నారు. ఇవి కాకుండా మిగిలిన కేసుల్లో కూడా ఇరు పార్టీలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను కానీ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా మండల లీగల్ సర్వీసెస్ కమిటీలను సంప్రదించి రాజీ చేసుకోవచ్చని సూచించారు.

వ్యర్థాలతో కళాకృతులు

ప్లాస్టిక్ బాటిళ్లు, శుభలేఖలతో బొమ్మల తయారీ



ఇంట్లో బొమ్మలు తయారు చేస్తున్న తాతాబత్తుల వీరభద్రకుమారి





ప్లాస్టిక్ బాటిళ్లతో తయారు చేసిన బొమ్మలు





శుభలేఖలతో తయారు చేసిన బొమ్మలు

పోడూరు: తెలివితేటలకు సృజనాత్మకత తోడైతే ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చు. పనికిరావని పారవేసే వస్తువుల నుంచి ఆకట్టుకునే కళాకృతుల్ని తయారుచేయొచ్చు. పోడూరు మండలం జిన్నూరు గ్రామానికి చెందిన తాతాబత్తుల వీరభద్రకుమారి కూడా అదే కోవలోకి వస్తారు. శుభలేఖలు, ప్లాస్టిక్ బాటిళ్లతో అందమైన బొమ్మలు, అలంకరణ వస్తువులు తయారు చేస్తూ అబ్బురపరుస్తున్నారు. ప్లాస్టిక్ బాటిళ్లను కట్టర్‌తో కావాల్సిన రీతిలో కట్ చేసి స్పీడ్ గమ్‌తో భాగాలను అతికించి బొమ్మలను, వివిధ వస్తువులను తయారు చేయవచ్చని వీరభద్రకుమారి చెబుతున్నారు. ఇలా తయారు చేసిన వస్తువులను డిజైనింగ్ పేపర్, స్టికర్లు, పూసలతో మరింత అందంగా తీర్చిదిద్దుతున్నారు.

పర్యావరణానికి మేలు..

ప్రస్తుతం ఎక్కడ చూసినా ప్లాస్టిక్ బాటిళ్లు, ఫంక్షన్లలో వాడే డిస్పోజబుల్ ప్లేట్లు, గ్లాసులు, కప్పులతో చెత్త నిల్వలు పేరుకుపోతున్నాయి. వీటిలో బాటిళ్లను చాలావరకు చెత్త ఏరుకునే వారు సేకరిస్తున్నారు. ఇలా సేకరించిన వ్యర్థాలు రీసైక్లింగ్‌కు వెళ్తుంటాయి. చెత్త ఏరుకునేవారు సేకరించని ప్లాస్టిక్ బాటిళ్లు, వ్యర్థాలు క్రమక్రమంగా మట్టిలో నిల్వ ఉంటున్నాయి. వీటితో పాటు పంట కాలువలు, మురుగుకాలువల్లో టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు బాటిళ్ల రూపంలో ఉంటున్నాయి. వీటివల్ల జలచరాల మనుగడకు ముప్పు ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లతో బొమ్మలు, గిఫ్ట్ ఆర్టికల్స్ వంటి తయారీని బాగా ప్రోత్సహిస్తే క్రమంగా వాటికి డిమాండ్ పెరుగుతుంది. వాటికి డిమాండ్ పెరిగితే బయట చెత్తరూపంలో కనిపించవు. దానివల్లే ప్లాస్టిక్ వ్యర్థాలు తగ్గి పర్యావరణానికి మేలు జరిగే అవకాశం ఉంటుంది.

చిన్నప్పటి నుంచే ఆసక్తి

చిన్నతనంలో చాలామంది పిల్లల్లాగే పేపర్‌తో బొమ్మలు తయారు చేసేదానిని. అదే స్ఫూర్తితో ప్లాస్టిక్ బాటిళ్లు, శుభలేఖలతో బొమ్మలు చేయాలనే ఆలోచన వచ్చింది. మొదట్లో కాస్త కష్టమైనా తరువాత వాటితో అందమైన బొమ్మలు తయారు చేయడం నేర్చుకున్నాను. దాదాపు 10 ఏళ్ల నుంచి వాటితో బొమ్మలు తయారు చేస్తున్నాను. వేసవికాలంలో మా ఇంటి పక్కనే ఉన్న గ్రంథాలయంలో వేసవి శిక్షణకు వచ్చే విద్యార్థులకు కూడా బొమ్మలు తయారు చేయడం నేర్పుతున్నాను.

– తాతాబత్తుల వీరభద్రకుమారి, జిన్నూరు, పోడూరు మండలం

హెల్మెట్ ధరించకపోతే నో ఎంట్రీ..!

- హెల్మెట్ లేకపోతే అనుమతి లేదు
- చర్యలు తప్పవంటున్న పోలీసులు



ఇటీవల తణుకులో హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న జిల్లా ఎస్పీ రవిప్రకాష్

తణుకు: రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగిపోతోంది... ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారు... 80 శాతం మంది తలకు గాయాల వల్లనే చనిపోతున్నారు... జాతీయ రహదారి భద్రత సంస్థ ఈ విషయాలను ఇటీవల నివేదికలో స్పష్టం చేసింది. అయితే వాహనదారులు మాత్రం సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న వరుస ప్రమాదాలు నేపథ్యంలో జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ ఈ అంశంపై ఫోకస్ పెట్టారు. మార్చి 1 నుంచి హెల్మెట్ ధారణ తప్పనిసరి చేస్తూ ఇప్పటికే ఆయన ఆదేశాలు జారీ చేశారు. దీంతో హెల్మెట్ వినియోగంపై చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

అక్కిడక్కడే హెల్మెట్ కొనుగోలు...

జిల్లాలో ఇటీవలి కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగిపోయింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనాల ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో చాల మంది ప్రాణాలు కోల్పోతుండగా వీరిలో యువత ఎక్కువ శాతం మంది చనిపోతున్నారు. అయితే తణుకు సర్కిల్ పరిధిలో హెల్మెట్ వినియోగంపై గత మూడు నెలలుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఒక్కరు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అయినప్పటికీ వాహనదారుల్లో మార్పు రాకపోవడంతో పోలీసులు కఠిన చర్యలకు దిగారు. హెల్మెట్ ధరించకపోతే పట్టణంలోకి అనుమతి లేదని గతంలో శివారు ప్రాంతాల్లో నిలిపివేశారు. అయితే హెల్మెట్ ధరించని వారిని ఆపి జరిమానా వేయడం పాత విధానం కాగా ఇకపై అలా వాహనం నడిపి పోలీసులకు పట్టుబడితే మాత్రం వాహనాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుంటారు. హెల్మెట్ కొనుగోలు చేసి ధరించే వారిని ప్రోత్సహిస్తున్నారు. అక్కడికక్కడే హెల్మెట్ కొనుగోలు చేయిస్తున్నారు. ఇంటి వద్ద ఉందని చెబితే తీసుకువచ్చిన తర్వాతనే ఇస్తామని తెగేసి చెబుతున్నారు.

మన నిర్లక్ష్యం కుటుంబానికి శిక్ష కాకూడదు...



హెల్మెట్ ధరించడం మన భద్రతకే అని గ్రహించాలి. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంది తలకు గాయాలవల్లనే మృత్యువాత పడుతున్నారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయం తప్పుతుంది. మన నిర్లక్ష్యం కుటుంబానికి శిక్ష కాకూడదు. ఇక నుంచి హెల్మెట్ ధరించకపోతే చర్యలు తప్పవు.

– సీహెచ్ ఆంజనేయులు, సీఐ, తణుకు

మహిళలకు స్ఫూర్తిదాయకం సావిత్రిబాయిఫూలే



మాధవరం ఏపీ-2 పాఠశాలలో సావిత్రిబాయిఫూలే వర్ధంతి



తాడేపల్లిగూడెంలో సావిత్రిబాయిపూలేకు నివాళ్లులర్పిస్తున్న దృశ్యం



తణుకులో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: మహిళలకు స్ఫూర్తిదాయకం సావిత్రిబాయిపూలే అని ప్రధానోపాధ్యాయుడు డొంకా వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని మాధవరం ఏపీ-2 పాఠశాలలో సావిత్రిబాయిపూలే వర్ధంతిని నిర్వహించారు. తొలుత ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భర్త ప్రోత్సాహంతో మహిళా విద్యకు బీజం వేసిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే అని కొనియాడారు. ఎన్నో పాఠశాలలను నెలకొల్పి బాలికల విద్యను ప్రోత్సహించారన్నారు. బాలికా విద్యకు ఆమె చేసిన సేవలను ఎన్నటికీ గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు పీవీ.సుబ్బారావు, జిల్లా నాడు-నేడు గ్రీవెన్స్ నోడల్ ఉపాధ్యాయుడు గుదే సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే

తాడేపల్లిగూడెం (టీఓసీ): సమాజంలో అసమానతల మీద అలుపెరగని పోరాటం చేసి అణగారిన వర్గాల్లో విద్యా వ్యాప్తికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రి బాయిపూలే అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ కొనియాడారు. సావిత్రిబాయి పూలే ఆత్మగౌరవ వర్ధంతి సందర్భంగా శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సభ్యులు పట్టణ సంఘ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సావిత్రి బాయి జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తుమరాడ చిన్న, పెదిరెడ్ల రమేష్, సుదీర్, గాజుల నాగేశ్వరరావు, సతీష్, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళులు...

తణుకు అర్బన్: స్త్రీ విద్య అత్యధిక ప్రాధాన్యతనిచ్చి మహిళలందరినీ అక్షరాస్యులుగా చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు తణుకు రాష్ట్రపతి రోడ్డులోని ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తమ్మయ్య మాట్లాడుతూ కుల మత బేధాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించి అందరి హృదయాల్లో గూడుకట్టుకున్న వ్యక్తిగా పూలే నిలిచారన్నారు. భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా స్త్రీ విద్యాభివృద్ధికి కృషి చేసిన మహిళా ఉద్యమకారిణి అని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, గుబ్బల సూర్యచంద్రరావు, నత్తా కృష్ణవేణి, జంగం ఆనంద్‌కుమార్, సప్పా బలరామ్, తాటిపర్తి వాసు, కుడుపూడి చంద్రరావు, సామంతుల అప్పారావు, సంగిరెడ్డి శ్రీనివాస్, రేలంగి రాంబాబు పాల్గొన్నారు.

నులి పురుగులను నివారిద్దాం



నులిపురుగుల నిర్మూలన మాత్రలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో తదితరులు

పెంటపాడు: జాతీయ నులిపురుగుల నిర్మూలన పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ కలిగి ఉండాలని తహసీల్దార్ జీవీ శేషగిరిరావు పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకొని ముందుస్తుగా మండల కార్యాలయంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులకు అవగాహన శుక్రవారం నిర్వహించారు. అన్ని పాఠశాలల్లో జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆల్‌బెండాజోల్ మాత్రలు వాడేలా చూడాలన్నారు. దీనిపై ఉపాధ్యాయులు, ఆరోగ్యశాఖ అధికారులు సంయుక్తంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా ముదునూరు ప్రాథమిక వైద్యాధికారి ఎస్వీ రమణ, ఎంపీడీవో డి. దామోదరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గాభవాని, పెంటపాడు వైద్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాశ్వత భూహక్కు రైతులకు ఎంతో ఉపయోగం



అలంపురంలో డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న తహసీల్దార్ శేషగిరిరావు, తదితరులు

పెంటపాడు: జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పథకం రైతులుకు ఎంతో ఉపయోగమని తహసీల్దార్ జీవీ శేషగిరిరావు పేర్కొన్నారు. జగనన్నభూహక్కు- భూరక్ష పథకంలో భాగంగా శుక్రవారం ఉదయం కోరిమిల్లి గ్రామం, అలంపురం గ్రామాల్లో సర్వే చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన డ్రోన్ వినియోగాన్ని శుక్రవారం ఆయన మండల సర్వేయర్ దీప్తితో కలసి పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో 1490 ఎకరాలకు గానూ 363 సర్వే నెంబర్లు ఉన్నాయన్నారు. ఈ పథకం ద్వారా భూహక్కు పత్రాలకు ఇచ్చేందుకు, రైతులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా ఉండేందుకు గాను ఈ సర్వేను ప్రభుత్వం చేపట్టిందన్నారు. రీసర్వే వల్ల పొలాలు కొనుక్కొనేందుకు, అమ్ముకొనేందుకు వీలవుతుందన్నారు. బ్యాంక్ రుణాలు పొందవచ్చన్నారు. చైను, టేబుల్‌తో భూమిని కొలిచే స్థాయి నుంచి ఈటీఎస్ పరికరం ద్వారా రీసర్వే చేసే టెక్నాలజీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. సరిహద్దు, పొలంగట్లు తదితర తగాదాలు ఇక ఉండబోవన్నారు. రైతుల ప్రయోజనం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ విధానం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. ఎఫ్ఎంబీ నెంబర్లు పట్టా ఇచ్చేందుకు ఉపయోగమన్నారు. రైతుల సమస్యలు ఈ సర్వే ద్వారా తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్వోలు, డ్రోన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పనికాలానికి వేతనాలు చెల్లించాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి కూలీలకు పనిచేసిన కాలానికి వేతనాలు, పే స్లిప్పులు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పట్టెంపాలెం గ్రామంలో ఉపాధి పని ప్రాంతంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో కూలి ఎంత పడేదో తెలిసేదని, ప్రస్తుతం తెలియడం లేదని కూలీలు తమ దృష్టికి తెచ్చారన్నారు. పని ప్రాంతంలో పనిముట్లు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని మంచినీరు, టెంట్లు వంటివి ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాలపర్తి సుబ్బలక్ష్మి, మల్లాది బుజ్జి, చాపల కృష్ణ, ఆరుగొల్లు రామలక్ష్మి, రాములు తదితరులు పాల్గొన్నారు.

యూత్ హాస్టల్స్ సభ్యత్వం ద్వారా సదుపాయాలు



వైహెచ్ఏఐ ఇన్స్టిట్యూషనల్ సభ్యత్వ సర్టిఫికెట్‌ను అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: యూత్ హాస్టల్స్ సభ్యత్వం ద్వారా వివిధ ప్రాంతాల్లో అనేక సదుపాయాలు పొందే అవకాశం ఉందని భీమవరం డీఎన్నార్ కళాశాల సెక్రటరీ అండ్ కర్సపాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) అన్నారు. శుక్రవారం యూత్ హాస్టల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(వైహెచ్ఏఐ) ఇన్స్టిట్యూషనల్ సభ్యత్వాన్ని అసోసియేషన్ భీమవరం డిస్ట్రిక్ యూనిట్ చైర్మన్ మట్లపూడి సత్యనారాయణ డీఎన్నార్ కళాశాలకు సభ్యత్వ సర్టిఫికెట్స్‌ను అందచేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వైహెచ్ఏఐ సభ్యత్వం పొందితే విజ్ఞాన, విహారయాత్రలకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు, పారిశ్రామికవేత్తలకు వైహెచ్ఏఐ అనేక సౌకర్యాలు కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అంజన్‌కుమార్, కళాశాల సహాయకార్యదర్శి కొత్తపల్లి శివరామరాజు, తాళ్లపూడి గాంధీ, అబపాల రామ్మూర్తి, బోణం పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్రైడే డ్రై డే ర్యాలీలు



వీరవాసరంలో డ్రైడే అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: వీరవాసరం గ్రామంలో చిన్న పేట, గోగులమ్మ పేట ఏరియాల్లో ఫ్రై డే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ పి.శ్రీనివాసరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ కె.భాస్కరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ప్రజలకు దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు గురించి అవగాహన కల్పించారు. నివారణ చర్యలు గురించి తెలియజేస్తూ పంచాయతీ ఆధ్వర్యంలో జరుగుతున్న యాంటీ లార్వల్ మెజర్స్, ఫాగింగ్ గురించి నీటి నిల్వలు, శానిటేషన్ గురించి పంచాయతీ వారికి సూచించారు. ఇక్కడ సిబ్బంది చేసే పనిపై సంతృప్తి వ్యక్తపరిచి అభినందించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దేవదాసు గారు, సూపర్వైజర్ జీవివి సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ వై మోహన్ రావు, ఏఎన్ఎం భవాని పాల్గొన్నారు.

గొరగనమూడిలో..

పాలకోడేరు: జ్వరాలను నియంత్రించాలంటే దోమల నివారణ తో పాటు, పరిసరాల పరిశుభ్రతను పరిరక్షించు కోవాలని పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రంగం నాయుడు అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండలంలోని గొరగనమూడి, పాలకోడేరు, విస్సాకోడేరు, పెన్నాడ, మోగల్లు తదితర గ్రామాల్లో శుక్రవారం వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రంగం నాయుడు ఆదేశాలతో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి గ్రామాల పంచాయతీ సిబ్బందికి తెలియపరచడమే కాకుండా బ్లీచింగ్ చల్లించారు. అదే విధంగా ఆయా ప్రాంతాల ప్రజలకు దోమల నివారణ పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు శంకర్, అయ్యప్ప శ్రీనివాస్, నాగమణి, అమ్మాజీ, చండీరాణి తదితరులు పాల్గొన్నారు

రేపు ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం(ప్రకాశంచౌక్): గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఉదయం మేంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు, ఎస్ఎల్‌జీ ప్రతినిధి వై.రణదివె, అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం కన్వీనర్ వి. రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో హైదరాబాద్‌లోని మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎస్ఎల్‌జీ (శ్రీ లక్ష్మి గాయత్రి)హాస్పిటల్‌కు చెందిన సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ.సుధీర్ రోగులను పరీక్షించి, వైద్య సేవలు అందిస్తారన్నారు మెడికల్ క్యాంపులో ఉచిత పరీక్షలు, శస్త్ర చికిత్సలకు అవసరమైన వైద్య సహాయం అందిస్తారని తెలిపారు.

శ్రీవారి నిధులతో రాములోరి గుడుల నిర్మాణం



పెదకాపవరంలో రామాలయం అభివృద్ధి కోసం వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఆకివీడు: రాములోరి గుడులు అభివృద్ధికి, పునర్నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన శ్రీవారి నిధులు రూ.10 లక్షలు కేటాయిస్తున్నారని దేవస్థానం ఇన్‌స్పెక్టర్ వీ.వెంకటేశ్వరరావు చెప్పారు. మండలంలోని పెదకాపవరం గ్రామంలోని కోదండ రామాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకర్లతో ఆయన మాట్లాడుతూ పెదకాపవరం, చినకాపవరం గ్రామాల్లోని శ్రీరామ చంద్రమూర్తి ఆలయాలకు నిధుల కోసం గ్రామస్తులు విజ్ఞప్తులు చేశారని చెప్పారు. ప్రతిపాదనల్ని టీటీడీకి పంపుతామని చెప్పారు. గతంలో మండలంలోని గుమ్ములూరుతో పాటు ఇతర మండలాల్లో వచ్చిన ప్రతిపాదనలు పంపగా రూ. 10 లక్షలు మంజూరు చేస్తూ ఆదేశాలు వచ్చాయన్నారు. త్వరలోనే ఈ దేవాలయాలకు కూడా నిధులు వస్తాయని చెప్పారు. కోదండ రామాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ కఠారి నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో ఆలయ పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. టీటీడీ నిధులు కూడా వస్తే ఆలయం మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు.

క్లుప్తంగా

బలుసులమ్మ అమ్మవారికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో బలుసులమ్మ అమ్మవారి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రదీప్ శర్మ, గోపీనాథ్ శర్మ, మల్లిఖార్జున శర్మ బ్రహ్మత్వంలో విశేష పూజలు జరిగాయి. భక్తులు విశేషంగా హాజరై అమ్మవారిని దర్శించారు. ఈ సందర్భంగా భక్తులు సహాయ సహకారాలతో భారీ అన్నసమారాధన జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షులు కొట్టు అంజిబాబు, కమిటీ సభ్యులు తదితరులు పర్యవేక్షించారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ



తణుకులో వీధి వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

తణుకు టౌన్: వాసవి దీవెన కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పాలకుర్తి గాయిత్రీ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు నీడగా వుండే గొడుగులను పంపిణీ చేశారు. శుక్రవారం సాయంత్రం తణుకులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో వీధి వ్యాపారాలు చేసుకునే ఇద్దరు వ్యాపారులకు నీడను ఇచ్చే గొడుగులను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వీరభద్రయ్య, కార్యదర్శి చంద్రమౌళి గుప్తా, కోశాధికారి మురళీ జగదీష్, కాజా రమేష్, శ్రీను వెంకటేశ్వర గుప్తా, నాగేశ్వరరావు, శివ ప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వివిధ రంగాల్లో మహిళలకు సత్కారం




తణుకులో మహిళలను సత్కరిస్తున్న బ్యాంకు అధికారులు

తణుకు: వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను తణుకు గోదావరి అర్బన్ మల్టీ స్టేట్ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. బ్రాంచి మేనేజర్ వై.రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉంటున్నారని మహిళలకు స్వేచ్ఛ, సమాన హక్కులు కల్పిస్తే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. సత్కారం అందుకున్న వారిలో ప్రముఖ సామాజికవేత్త, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సంకు మనోరమ, ప్రముఖ న్యాయవాది కలిదిండి పద్మావతి ఉన్నారు.

పన్ను చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లు

భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరం పురపాలక సంఘానికి చెల్లించాల్సిన ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు తక్షణం చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ తెలిపారు. పన్ను బకాయిలు చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బకాయిదారుల కుళాయి కనెక్షన్లు తొలగించడానికి వార్డుల వారీగా టీములు కూడా ఏర్పాటు చేశామన్నారు. పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం సెలవు దినాలైన శనివారం, ఆదివారం కూడా మునిసిపల్ కార్యాలయం, సచివాలయంలో కూడా ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీసీ డ్రెయిన్ నిర్మాణ పనుల పరిశీలన



సీసీ డ్రెయిన్ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ

నరసాపురం: మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ శుక్రవారం పట్టణంలోని 10వ వార్డులో14వ ఆర్థిక సంఘం నిధులు రూ 13.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీ డ్రెయిన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. పనులు నాణ్యతతో చేయాలని సూచించారు. పట్టణంలో అభివృద్ధి పనులకు 14వ ఆర్థిక సంఘం నిధులతో పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్నామని వివరించారు.

క్రీస్తు శ్రమలను విశ్వాసులు గుర్తుంచుకోవాలి

పెంటపాడు: ఏసుక్రీస్తు శిలువ ధ్యానాలలో ఆయన శ్రమలను ప్రతి విశ్వాసి తలంచుకోవాలని గూడెం టౌన్ లూథరన్ సంఘ గురుమండల అధ్యక్షుడు కె. విజయరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన శిలువ శ్రమల ధ్యాన కూడికలలో భాగంగా 15వ రోజు మహాలక్ష్మినగర్ ప్రాంతంలో ఆధ్యాత్మిక గృహకూడిక సమావేశం నిర్వహించారు. స్థానిక లూథరన్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రాగి వైరు చోరీపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని రామన్నగూడెంలోని ముళ్ళపూడి అశ్రిత చౌదరి చెందిన వ్యవసాయ క్షేత్రంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి, దానిలోని రాగి వైరును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీనిపై నీలాద్రిపురం ఎలక్ట్రికల్ ఏఈ పరమేశ్వరరావు శుక్రవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై వీఎస్.వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించాలి



పేద మహిళకు కుట్టు మిషన్ అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహిళలు ఆర్థికంగా పరిపుష్టి సాధించాలని లయన్స్‌క్లబ్ జిల్లా క్యాబినెట్ సెక్రటరీ నూకల నాగ మల్లేశ్వరరావు అన్నారు. పట్టణంలోని పేరిచర్ల ఫౌండేషన్ కార్యాలయంలో లయన్స్‌క్లబ్ డైమండ్స్ అడ్మిన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో శుక్రవారం పేద మహిళకు కుట్టు మిషన్ అందజేశారు. డాక్టర్ కమల మాట్లాడుతూ డైమండ్స్ సేవలు పేదలకు అందుతున్నాయని కొనియాడారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంధి లక్ష్మి, సోనామ్, నందిని, ఆంజనేయస్వామి, కె.వెంకటేశ్వరరావు, ముదునూరి శివరామరాజు, రెడ్డి రాజు, సభ్యులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రణాళికను అమలు చేయాలి

పెంటపాడు: దాళ్వాలో రైతులకు ఇబ్బందులు ఏర్పడకుండా పంట పూర్తయ్యే వరకు సమగ్రంగా సాగునీటి ప్రణాళికను అమలు చేయాలని మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్ సూచించారు. శుక్రవారం పెంటపాడు మండల కార్యాలయం వద్ద వ్యవసాయసలహామండలి అత్యవసర సమావేశం ఏవో కె. పార్థసారధి, ఇరిగేషన్ ఏఈ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా పలు గ్రామాల ఆయకట్టు స్థితిని సమీక్షించారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పంట విరామ సమయంలో ఆరుతడి పంటల వైపు రైతులు ఆశక్తి చూపేలా చర్యలు తీసుకోవాలన్నారు. సలహామండలి సభ్యులైన కొందరు దాళ్వా ధాన్యం పట్టుబడులకు సంబంధించి సంచుల కొరత లేకుండా చూడాలని కోరారు. పంట కోత ప్రయోగాలు, ఈ క్రాఫ్ నమోదు పలు విషయాలపై చర్చించారు.

నేటి లేగదూడలే రేపటి పాడి పశువులు

భీమవరం అర్బన్: నేటి లేగదూడలే రేపటి పాడి పశువులని, వాటి పెంపకం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డీడీ డాక్టర్ జి.ఏసురత్నం సూచించారు. భీమవరం మండలంలోని తుందుర్రు గ్రామ పశు వైద్యశాలలో శుక్రవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ డీడీ డాక్టర్ జి.ఏసురత్నం మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు పాడి పెంపకం ద్వారా అదనపు ఆదాయం పొందుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు వివిధ పథకాలు రూపొందించి అమలు చేస్తోందని తెలిపారు. గతంలో గేదెలను దున్నపోతు వద్ద తోలి సాధారణ పద్ధతి ద్వారా గర్భధారణ జరిపించేవారని, ఇప్పుడు కృత్రిమ గర్భధారణ ద్వారా పెయ్యిలు మాత్రమే జన్మిస్తున్నాయని వివరించారు. ఈ విధానం ద్వారా పుట్టే లేగదూడలు ఆరోగ్యంగా ఉండటమే కాకుండా నాణ్యమైన బ్రీడ్ కలిగి ఉంటాయని చెప్పారు. అనంతరం లేగదూడల పోషణ, వ్యాధుల నివారణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.